

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతుల స్వీకరణ సోమవారం యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి భవన్ నందు ఈ కార్యక్రమం ద్వారా అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ప్రభుత్వ అదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పిజిఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ ప్రక్రియ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసివల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధి కారులు అర్జీదారులకు అందుబాటులో ఉండి అర్జీ లు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదే విధంగా అర్జీదారులు తమ అర్జీలను Meekosam. ap.gov.in నందు సమోదు. చేసుకో వచ్చునని అన్నారు. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చునని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

కష్టాల కడలిలో కౌలు రైతులు

- బ్యాంకులు రుణాలు ఇవ్వవు.. ప్రభుత్వం గుర్తించదు
- పంట వాళ్లది.. పరిహారం పట్టాదారులది
- పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన దిగుబడులు



వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన కౌలు రైతు

ప్రజాశక్తి - రాజోలు

జిల్లాలో కౌలు రైతులు పుట్టెడు కష్టాలు పడుతున్నారు. వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, కౌలు ధరలు గణనీయంగా పెరగడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు వర్తించక పంటలు దిగుబడి రాక అవస్థ పడుతు న్నారు. ఈ వానాకాలం సీజన్‌లో కురిసిన అధిక వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. దిగుబడులు గణనీయంగా తగ్గడంతో కౌలు రైతులు కుదేలయ్యారు. ప్రభుత్వం కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి ఉంటే తమకు కాస్తా ప్రయోజనం కలిగేదని చెబుతున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ చేపడుతామని చెప్పినా ఆచరణకు నోచుకో లేదు. సాధారణ పట్టాదారులైన కర్షకుల మాదిరి గానే తమకూ భరోసా వస్తుందని కౌలు రైతులు ఆశించారు. కానీ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు కావస్తున్నా కౌలు రైతులకు ఈ పథకం అమలుపై ఎలాంటి నిర్ణయం లేకపోవడంతో వారికి కన్నీరే మిగిలింది.

ఏపంట సాగు చేసినా..

భూములు కౌలుకు తీసుకొని పంటలు సాగుచేసినా కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదు. దీంతో వారు వ్యవసాయం చేసేందుకు సుముఖత చూపడం లేదు.దీంతో కౌలు రైతులు దిక్కుతోచని పరిస్థితి. వీరికి పంట రుణాలు అందక పోవడంతో వడ్డీలకు అప్పులు తెచ్చి వాటిని తిరిగి చెల్లించేందుకు అష్టకష్టాలకు గురవుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో తూర్పు, మధ్య డెల్టాలకు మొత్తం 4.80 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. కానీ వాస్తవ సాగు 4 లక్షల ఎకరాలు మాత్రమే. ఒక్క డాక్టర్ బిఆర్.కోనసీమ జిల్లాలోనే 1.70 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సూమరుగా 3.5 లక్షల మంది పైనే కౌలు రైతులు ఉంటారని అంచనా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1.70 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. జిల్లాలో 1.20 లక్షల మందికి పైగా కౌలు రైతులు ఉన్నారు. వీరికి పంట రుణాలు అందించి సాగుకు చేయూతనివ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రుణ అర్హత కార్డుల మంజూరుకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో 75 కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు అందజేశారు. జిల్లాలో గత ఏడాది ఇచ్చిన 1.16 లక్షల రుణ అర్హత కార్డుల్లో ఇప్పటి వరకు 70 వేల కార్డులను రెవెన్యూ అధికారులు పునరుద్ధరించారు. కాకినాడ జిల్లాలో పంటలను సాగు చేస్తున్న వారిలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్టు అంచనా. గత ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన కౌలు రైతు చట్టంతో వీరికి అన్యాయం జరుగుతోంది. సిసిఆర్ కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలు ఇస్తామని చెబుతోంది. ఈ ఏడాది 69 వేల మందికి కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకోగా 54,766 మందికి కార్డులు జారీ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 1.85 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా 2.18 లక్షల మంది రైతులున్నారు. వీరిలో దాదాపు 80 శాతం కౌలుకు తీసుకున్నవారే. 1.10 లక్షల మందికి కార్డులివ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటికి 32852 మందికి (29.87 శాతం) మంజూరు చేశారు. ఇతర వీటిలో కొంతమంది రైతులు తప్పుకోవడం, అదనంగా కొత్తవారు చేరడం జరుగుతోంది. క్షేత్ర స్థాయిలో కౌలు రైతుల మార్పు, చేర్పులు ఇప్పటికే జరిగిపోయాయి. కానీ పాత కార్డుల పునరుద్ధరణ నుంచి కొత్త కార్డుల మంజూరు ప్రక్రియ వరకు మందకొడిగానే సాగుతోంది. ఈ కార్డులు మంజూరు చేసిన తర్వాత బ్యాంకుల ద్వారా రుణాలు అందించేందుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. భూమిని కౌలు రైతులు సాగు చేస్తున్నా.. వారికి రుణ అర్హత కార్డు ఇవ్వడానికి అసలు రైతులు సుముఖత చూపని పరిస్థితి రాజోలు నియోజకవర్గం లో అన్ని గ్రామాల్లో ఉంది. ఈ నేపథ్యంలో కౌలు రైతులను ఆదుకునేలా ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

అవగాహన కల్పించని రెవెన్యూ అధికారులు

రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలేదు. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే పరిశీలిస్తామని బెబుతున్నారు. కాని గ్రామీణ రైతులకు దానిపై అవగాహన ఉండడంలేదు. భూ యాజమానిని ఒప్పించడానికి రెవెన్యూ కార్యాలయానికి తీసుకురావాలనే షరతు పెడుతుండడంతో రైతులెవరూ కౌలు కార్డులకు దరఖాస్తుల చేసుకోలేకపోతున్నారు. ఇందుకు పట్టాదారులెవరూ కౌలు రైతులకు సహకరించడంలేదు.

పొలాలన్నీ చేపల చెరువులు

పంట పొలాలన్నీ చేపల చెరువులుగా మారుతున్నాయి. ఆక్వారంగం విస్తరించడంతో యాంత్రీకరణతో కూలీలకు సైతం ఉపాధి కరువై వలస వెళ్లాల్సిన పరిస్థితి . తొలుత భూస్వాములు పట్టణాల బాట పడితే.. తర్వాత కౌలుదారులు అదే బాటలో ఉపాధి కోసం పయనమవడం జిల్లాల్లో నెలకొన్న పరిస్థితికి నిదర్శనం. అమలాపురం సమీపంలో వన్నేచింతలపూడి,తాండవ పల్లి,గ్రామలలో వ్యవసాయ పంట పొలాలు అన్ని చేపలు,రొయ్యల చెరువులు గా మారడంతో ఇక్కడ పరిస్థితి మరి అధ్వనంగా తయారైంది.అలాగే అల్లవరం, సఖినేటిపల్లి మండలాలలో కుడా ఇదే పరిస్థితి.

కౌలు ఎలా చెల్లించాలి

వ్యవసాయం గిట్టుబాటుగా లేదు. కౌలు భూమిని తీసు కొని పంటలు సాగుచేసినా పెట్టుబడి కూడా లభించడం లేదు. నేను రెండు ఎకరాలు వరి సాగు చేశాను. సుమారు రూ.40వేలు పె ట్టుబడి పెడితే కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. వడ్డీకే సరిపోయింది. ఇక నేను భూయజమానికి కౌలు ఎలా చెల్లించాలి.

-యార్లగడ్డ శ్రీరాములు, కౌలు రైతు, బి.సావరం

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

కౌలు రైతు సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నేను మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. సుమారు రూ.75 వేలు ఖర్చులైతే పంట అమ్మగా వచ్చింది .ఇంచుమించు అంతే. పంటలకు గిట్టుబాటు ధరలు లేక సాగు భారంగా మారుతోంది. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

-బుంగ సత్యనారాయణ, కౌలు రైతు ,బి.సావరం

ఆధునికీకరణకు నోచుకోని రహదారి

- వెలిచేరు నుంచి బొబ్బర్లంక వరకూ మరమ్మతులకే పరిమితం
- తరచూ ప్రమాదాలు



రోడ్డుపై గోతులు, (ఇన్‌సెట్)లో ప్రమాదకరంగా ఉన్న అంచులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వెలిచేరు నుంచి బొబ్బర్లంక చర్చి వరకు ఉన్న రహదారి గోతులమయంగా మారింది. దీంతో రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఒక పక్క గోదావరి మధ్య డెల్టా ప్రధాన కాలువ పరోపక్క ముంపు నీరు ముందుకు వెళ్లే మేజర్ డ్రెయిన్. ఎత్తైన రోడ్డు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి కాలువలోకి వాహన చోదకులు ప్రమాద బారిన పడుతున్నారు. రైతులు వారు పండించిన పంటల ఉత్పత్తులను రాజమహేంద్రవరం తరలిం చేందుకు ఈ రోడ్డు మార్గాన్ని వెళ్తుంటారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి నిత్యం ఈ రోడ్డు మార్గాన యాత్రికలు వస్తుంటారు. 2011 సంవత్సరం తరువాత ఈ రోడ్డు ఆధునికీకరణకు నోచుకోలేదు. మండలంలోని మర్లపాలెం నుండి లొల్ల గ్రామం వరకు, ఆత్రేయపురం నుంచి వెలిచేరి వరకు ప్రయాణికుల రద్దీ దష్ట్యా పది మీటర్ల వెడల్పుతో రోడ్డును ఆధునికీకరించారు. వెలిచేరు నుంచి బొబ్బర్లంక వరకు రెండు వైపులా కాలువలు రోడ్డు ఎత్తుగా ఉండడంతో మధ్య డెల్టా కాలువ వైపు కొంతమేర రిటైనింగ్ వాల్ నిర్మించి, ఏడు మీటర్ల రోడ్డును ఆధునికీకరించేందుకు ఆర్అండ్‌బి అధికారులు రూ.36 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. 15 సంవత్సరాల నుండి ఈ ప్రతిపాదన నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రమాదాల సంఖ్య రోజుకి పెరుగుతున్నాయి. దీని నియంత్రించవలసిన ఆర్అండ్‌బి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రోడ్డు మరమ్మతులకే పరిమితమైంది. ఒక్కొక్క ప్రదేశంలో రోడ్డుకు బెర్మ్ లేకపోవడంతో ప్రమాదకర అంచులు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి వాహనదారులు ప్రమాద బారిన పడుతున్నారు. అధికారులు మాత్రం మరమ్మతులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. వెలిచెరు నుంచి బొబ్బర్లంక వరకు మరమ్మతులు చేసేందుకు రూ.70 లక్షల లు నిధులు మంజూరు కావడంతో ఆర్అండ్‌బి అధికారులు టెండర్లు పిలిచే పనిలో నిమగ్నమ య్యారు. దీంతో గుత్తేదారు ఇష్టానుసారంగా నాణ్యత లోపంతో మరమ్మతులు చేపట్టడంతో కొద్దిగాలానికి రోడ్డు ధ్వంసం అవుతుంది. పనులు జరిగే సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం గుత్తేదారులు ఇష్టానురాజ్యంగా పనులు చేయడంతో ఈ రోడ్డు కొద్దిరోజులకే గోతులమయంగా మారు తోంది.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక యుటిఎఫ్ హోం నందు యుటిఎఫ్ నూతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2025 -26 సంవత్సరానికి మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దీనిలో గౌరవ అధ్యక్షులుగా అద్దరి శ్రీనివాసరావు, అధ్యక్షులుగా జి.జె.పుత్ర కుమార్, ప్రధాన కార్యదర్శిగా దాసరి నాగేశ్వరరావు, సహాధ్యక్షులుగా జె.మనోజ్ కుమార్, మహిళా అధ్యక్షురాలుగా పి.బాల ప్రసన్న, మహిళా కార్యదర్శిగా బిఎన్‌విఎల్.చైతన్య, బి.ప్రపూర్ణ భారతి కోశాధికారిగా బిఎన్.మూర్తి, ఆడిటర్‌గా పివి ఎస్‌సి.మోహన్ ఎన్నికైనట్లు జిల్లా ఎన్నికల అధికారులు వై.మురళి, జివి.రమణ ఆదివారం తెలియజే శారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యుటిఎఫ్ సెక్రటరీ ఎస్.జ్యోతి బసు, మండల పెన్షన్ సంఘ గౌరవ అధ్యక్షులు కెవిఆర్.బాపూజీ, నాయకులు వై.బాలాజీ, కొప్పిశెట్టి శ్రీనివాస్, వైవివి.రమణ, పివివిజి ఎస్ఎన్.మూర్తి, గౌరీ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఇందుపల్లిలో ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఇందుపల్లి గ్రామపంచాయతీ వద్ద ఆదివారం అమలాపురం సాయి స్రవంతి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ సాయి స్రవంతి, జనరల్ మెడిసిన్ డాక్టర్ ఎర్రంశెట్టి వి.రావు, ఎముకుల సర్జన్ ఎం. వెంకట వినయ్‌లు గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన చికిత్సలు అందించారు. రక్త పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సాయి స్రవంతి హాస్పిటల్ వారు ఈ శిబిరాన్ని నిర్వహించారని నిర్వాహకులు డాక్టర్ వైవి.రావ్ తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన వైద్యులు, నిర్వాహకులకు గ్రామ సర్పంచ్ చోల్లంగి శివాలిని అప్పాజీ, ఎంపిటిసి సభ్యుడు కె.రాంబాబు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ అకెళ్ళ నారాయణ మూర్తి, టిడిపి మాజీ మండలం అధ్యక్షులు మల్లుల పోలయ్య, జనసేన పార్టీ గ్రామాకమిటీ అధ్యక్షులు నాగిరెడ్డి తాతారావు, మోటుపల్లి పవన్ వైద్యులను సన్మానించారు.

కార్టూ'నిజం'



మాజీ ఎంపీ కృష్ణమూర్తికి ఘన నివాళి



కృష్ణమూర్తి పార్థివ దేహం వద్ద నాయకుల నివాళి

ప్రజాశక్తి - అమలాపురం

మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు ఆదివారం ఘన నివాళులర్పించారు. ఢిల్లీలో కృష్ణమూర్తి శనివారం మృతి చెందారు. ఆయన పార్థివదేహం ఆదివారం అమలాపురం చేరుకుంది. కృష్ణమూర్తి పార్థివ దేహనికి కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పి పూలమాలలు వేసి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ కుసుమ కృష్ణమూర్తి సేవలు చిరస్మరణీమని అన్నారు. అమలాపురంలో స్థానిక నల్ల వంతెన దిగువున ఉన్న గొడౌన్స్ వద్ద కుసుమ కృష్ణమూర్తి అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ, మాజీ మంత్రి పరమట వీర రాఘవులు, మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరి, మాజీ ఎంపీలు అయితాబత్తుల బుచ్చి మహేశ్వర రావు, చింతా అనురాధ, వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుసుమ కృష్ణమూర్తి మృతికి సంతాపం

ఉప్పలగుప్తం: అమలాపురం మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి మృతికి ఆదివారం పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమలాపురం లోక్ సభ స్థానం నుంచి ఎంపీగా మూడుసార్లు గెలుపొందిన కృష్ణమూర్తి పేదల సంక్షేమానికి ఎనలేని సేవలందించారని అన్నారు. కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ డైరెక్టర్ అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపిపిలు పెయ్యల విష్ణుమూర్తి, జోగి అర్జునరావు, కాంగ్రెస్ నాయకుడు చీకట్ల అబ్బాయి, మాజీ సర్పంచ్‌లు గెడ్డం సురేష్ బాబు, అయితాబత్తుల వెంకట కష్టారావు, నాయకులు నిమ్మకాయల నాగేంద్ర ప్రసాద్, దామిశెట్టి జయ, దోనిపాటి విజయలక్ష్మి, బివివి.లక్ష్మీ శ్రావణి తదితరులు ఉన్నారు.

శిలాఫలకం ధ్వంసంపై చర్యలకు డిమాండ్




గేదెల్లంకలో ధ్వంసమైన శిలాఫలకం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గేదెల్లంక పుష్కర ఘాట్ రోడ్డు నిర్మాణం కోసం ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన జనసేన నాయకుడిపై చర్యలు తీసుకోవాలని వైసిపి గ్రామ కమిటీ డిమాండ్ చేసింది. గేదెల్లంక పంచాయతీ పరిధిలోని పుష్కర ఘాట్‌కు వెళ్లే ఉత్తర వాహిని రోడ్డు నిర్మాణానికి గత వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్ రూ.10 లక్షలు నిధులు కేటాయించారు. శంకుస్థాపన చేసి పనులు చేపట్టేందుకు శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొన్ని కారణాలతో పనులు జరగలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాలనలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, డిప్యూటి సిఎం పల్లెపండగలో భాగంగా రూ.1.85 కోట్ల నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న జనసేన పార్టీ నాయకుడు ఆదివారం స్థానిక ప్రజా ప్రతినిధులకు గాని, పంచాయతీ అధికారులకు గాని ఎటువంటి సమాచారం ఇవ్వకుండా యథేచ్ఛగా యంత్ర పరికరాల సాయంతో గతంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయించారు. అంతే కాకుండా రోడ్డు నిర్మాణం చేపట్టే ప్రాంతంలోని కొబ్బరి చెట్లను పంచాయతీ తీర్మానం లేకుండా తొలగిస్తుండటంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. జనసేన నాయకుడు, గుత్తేదారు గుద్దటి జమ్మిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ సానబోయిన పల్లయ్య, కోలా బాబ్జి అలియాస్ వెంకటేశ్వరరావు, జె.శ్రీనివాస్ వర్మ డిమాండ్ చేశారు. ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరికోటి శాస్త్రి

ప్రజాశక్తి - అయినవిల్లి

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ హరికోటి శాస్త్రి అన్నారు. ఆదివారం సిరిపల్లి నుంచి ముక్తేశ్వరం వెళ్లే ప్రధాన రహదారులలో ఆయన ఆధ్వర్యంలో హెల్మెట్ గురించి వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులకు లైసెన్స్, ఆర్సీ, హెల్మెట్ తప్పనిసరి అని హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారికి జరిమానావిధించారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి వారి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయినవిల్లి మండలంలోని ప్రధాన రహదారులలో ఈ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. బిఐఎస్ సర్టిఫైడ్ హెల్మెట్లు వినియోగించాలన్నారు. పలు అంశాలపై వాహన దారులకు పోలీసులు అవగాహన కల్పించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్



సమావేశంలో సభ్యుల వాగ్వివాదం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని కె.గంగవరం మండల పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. కె.గంగవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఎంపిపి పంపన నాగమణి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కూల్ల సర్పంచ్ చిల్లె నాగేశ్వర రావు మాట్లాడుతూ గ్రామానికి మంచినీటి ట్యాంకు నిధులు మంజూరైన నిర్మించలేదన్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి కాలేదని, మంచినీటి పైపులైన్లు లీకవుతున్న వాటిని నిర్వాహకులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా కుడుపూరు గ్రామంలోనూ, ఎర్ర పోతవరం గ్రామంలోని, పాతకోట, పాణింగపల్లి, పామర్రు గ్రామాల్లో మంచినీరు సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల సర్పంచులు సభలో తెలిపారు. దీంతోపటుగా ఐలాండ్ గ్రామ మయిన శేరి లంక గ్రామంలో మంచినీరు సక్రమంగా అందడం లేదన్నారు. వాటర్ ట్యాంక్‌పైన మూత లేకపోవడంతో పక్షులు స్నానం చేసి నీటిని అపరిశుభ్రం చేస్తున్నామని గ్రామ ఎంపిటిసి కొండేపూడి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో వీధిలైట్లు కూడా వెలగడం లేదని దీనిపై చర్యలు చేపట్టాలని అన్నారు. అదేవిధంగా ప్రధాని ఆవాస్ యోజన పథకంలో సర్వేలు ప్రజాప్రతినిధులకు తెలియకుండా చేస్తున్నారని, అధికార పార్టీ కార్యకర్తలు దగ్గరుండి వారికి కావాల్సిన విధంగా సర్వేలు నిర్వహించడంపై గ్రామ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇష్టం వచ్చినట్లు సర్వేలు చేస్తున్నారనిసర్పంచ్ పిల్లి రాంబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కె.గంగవరం మండలం బడ్జెట్‌ను ఏఓ చదివి వినిపించారు. సమావేశంలో ఎంపిడిఒ నందమూరి శ్రీనివాసు, తహశీల్దార్ శ్రీరామ్ ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు దూడల నాగేశ్వరరావు, హౌసింగ్ డిఇ సుంకర రాంబాబు, ఎంఇఒ నాగరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రాహుల్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వచ్చే నెల 12 నుంచి బాడీ బిల్డింగ్ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకన్ననాయుడు తదితరులు

ప్రజాశక్తి - అమలాపురం

జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 12న రంకిరెడ్డి కాశి విశ్వనాథం బాడీ బిల్డింగ్, ఫిజిక్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-26 పోటీలను స్థానిక ఆఫీసర్ రిక్రియేషన్ క్లబ్ నిర్వహిస్తున్నట్లు కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వంటెద్దు వెంకన్న నాయుడు ఆదివారం విలేకరులకు తెలిపారు. పోటీలకు సంబంధిం చిన పోస్టర్‌ను అసోసియేషన్ ప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ పోటీల వివరాలను సెక్రటరీ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలుపుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడా కారులు పాల్గొంటున్నారు. బాడీ బిల్డింగ్, మాస్టర్స్, ఫిజిక్స్ స్పోర్ట్స్ విభాగాల్లో 12 క్యాటగిరీలలో పోటీలను నిర్వహిస్తారన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల గెలుపొందిన వారికి నేషనల్ షీల్డ్స్, మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్, నగదు పురస్కారాలను బహుకరిస్తామని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పప్పుల శ్రీరామచంద్రమూర్తి, కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నగబేరి కృష్ణ మూర్తి, ఉపాధ్యక్షులు గారపాటి చంద్రశేఖర్, అమలాపురం మండలం వైస్ ఎంపిపి అడపా వెంకట సుబ్రహ్మణ్యం, అసోసియేషన్ మెంబర్స్ మట్టపర్తి వెంకట సముద్రం, నార్ని శ్రీను, చిక్కం రాజబాబు పాల్గొన్నారు.

రూ.55 లక్షలతో కమ్యూనిటీ భవనం ప్రారంభం



కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపి, ఎంఎల్‌సి

ప్రజాశక్తి - రామచంద్రపురం

అన్నయ పేట గ్రామంలో రూ.55 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబుఅధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లి సుభాష్ చంద్రబోస్ ఎంపీ లాడ్స్ నుంచి రూ.30 లక్షలు, 2018లో అప్పటి ఎంఎల్ఎ తోట త్రిమూర్తులు మంజూరు చేసిన రూ.25లక్షల తో కలిపి రూ.55 లక్షలతో ఈ కమ్యూనిటీ హాల్ నిర్మించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం ఇన్‌ఛార్జి పిల్లిసూర్య ప్రకాష్, మార్కెట్ కమిటీ అధ్యక్షులు అక్కల రిశ్వంత రాయ్, మండల అధ్యక్షులు అంబటి భవాని, మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ శ్రీదేవి శ్రీధర్, వైస్ ఎంపిపి శాఖ బాబి, పెమ్మిరెడ్డి మురళీకృష్ణ సర్పంచ్ సతీష్ కుమారి, జగన్నాయకుల పాలెం సర్పంచ్ అని శెట్టి రామకృష్ణ, వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారాం తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామంలో శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహిస్తారు. ఆదివారం రాజ మహేంద్రవరానికి చెందిన డాక్టర్ త్రిపురనేని రాజేష్ కుమార్, స్రవంతి దంపతులు రూ.10,116 విరాళాన్ని ఆలయ ఇఒ భాగవతుల వెంకట రమణమూర్తికి అందజేశారు. వీరికి స్వామి వారి దర్శనం అనంతరం వేదపండితులచే ఆశీర్వచనం చేయించి, తీర్థప్రసాదాలతో పాటూ స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించారు.



బుజ్జికి అభినందనలు తెలుపుతున్నశ్రీనివాస్

బుజ్జిని సత్కరించిన వైసిపి మండల కన్వీనర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - ఆలమూరు

వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పెదపళ్లకు చెందిన నెక్కంటి వెంకట్రాయుడు (బుజ్జి)ని పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బుజ్జికి మెమెంటోను బహూకరించి తెలియజేశారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాక్షించారు. రాష్ట్ర స్థాయి పదవిలో నియమించిన జిల్లా వైసిపి అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డికి, మండల కన్వీనర్ తమ్మనకు, పార్టీ శ్రేణులకు బుజ్జి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే రాష్ట్ర వైసిపి ఇంటలెక్చువల్ ఫోరం కార్యదర్శి కొడ మంచిలి హరీష్, గ్రామ వైసిపి నేతలందరూ బుజ్జిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుడ్డిగ వీర వెంకట్రావు, తమ్మన హరి, దొడ్డారపు సుబ్బారావు, గంటా శ్రీనివాసు, మేడపాటి లక్ష్మణరావు, అడబాల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు

సందిపూడికి చెందిన చింతలూరు నీటి సంఘం డైరెక్టర్ పల్ల వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఆ గ్రామ ఆయకట్టుకు చెందిన పంట కాలువ పూడికతీత పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆదే శాల మేరకు మండల పరిషత్ నిధులు రూ.లక్ష మంజూరు అయ్యాయి. దీనికి స్థానిక రైతులు విరాళాలు సేకరించి పంటకాలువ పూడికతీత పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పూడికతీత సుమారుగా మూడు రోజులు ఉండవచ్చని తెలిపారు.

నేరాలు ఘోరాలు

డివైడర్‌ను ఢీకొని లారీ బోల్తా

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట కాకినాడ కెనాల్ రోడ్డులో స్థానిక రైల్వే గూడ్స్ షెడ్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారుజామున ఓ లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో ఇతర వాహనాలు లేదా ప్రజలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక జార్జిపేట వై జంక్షన్ చెక్ పోస్ట్ వద్ద ఆదివారం కోరంగి ఎస్ఐ పి సత్యనారాయణ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకపోవడం, ఇతర కారణాలతో 21 మందికి జరిమానా జరిమానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎఎస్ఐ మేడిశెట్టి శ్రీనివాస్ తెలిపారు.

బంగారం, వెండి చోరీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని పేరవరంలో బంగారం, వెండి చోరీకి గురియైంది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకార పేరవరం గ్రామానికి చెందిన జన్యువుల రామభక్తుడు గత నెల 25న కుటుంబంతో కలిసి బెంగళూరులో ఉంటున్న తన కుమారుడు వద్దకు వెళ్లారు. తిరిగి వారు శనివారం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తీసి ఉన్నాయి. ఇంటి లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉండవలసిన 40 గ్రాముల బంగారం, 1 కేజీ వెండి చోరీకి గురియిందని గుర్తించారు. ఆదివారం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

యువకునిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసినట్లు బాధితురాలి తల్లి చేసిన ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో, కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇవి..నగర పంచాయతీ పరిధిలోని బందరుపాలెంనకు చెందిన బాలికను అదే ప్రాంతానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో వేధించేవాడు. గురువారం బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేశాడని బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఆమె ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థి దశ నుంచే బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ వి.మౌనిక సూచించారు. ఆదివారం మండలంలోని దివిలి గ్రామంలో ఉన్న బిసి బాలికల వసతి గృహంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్ స్థానిక కైట్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం ప్రారంభం అయింది. ఈ టోర్నమెంట్‌ను డివైఇఒ కెవివి.సత్య నారాయణ ప్రారంభించారు. ఈ టోర్నమెంటులో జిల్లాలోని పది మండలాల నుంచి 10 జట్లు పాల్గొంటున్నాయి. మొదటి మ్యాచ్‌లో కాజులూరు-పెదపూడి జట్లు పోటీ పడ్డాయి. ఈ కార్యక్రమంలో పలు మండలాల ఎంఇఒలు టివిఎస్.రామయ్య, డి.డేవిడ్, పి.వేణుగోపాల్, జోసెఫ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామానికి చెందిన అగ్నిప్రమాద బాధితుడు చక్రాంతి అమ్మిరాజు కుటుంబానికి ఉమర్ ఆలీషా విద్యాసంస్థల ఛైర్మన్, అఖిల్ విద్యాసంస్థల అధినేత ఇనకోటి గంగాధర్ సాయాన్ని అందించారు. ఆదివారం బాధితులను పరామర్శించి బియ్యం బస్తా, నెలకు సరిపడ నిత్యవసర వస్తువులు, రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మిరాజు కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల నవీన్, ఆకుల సురేంద్ర, నిమ్మల శ్రీను, గౌతు విజయ్, పిట్టల అభి పాల్గొన్నారు.

పెన్షనర్స్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్స్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో బాబా ఆటామిక్ రీసెర్చ్ సెంటర్ విశ్రాంత శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు, ఇన్కమ్ టాక్స్ విశ్రాంత అడిషనల్ కమిషనర్ డివి.సుబ్బారావు, సిజిఎస్‌టి రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ వివిఎల్ఎన్.కమలాకరరావు, కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమాఖ్య జనరల్ సెక్రటరీ ఎస్‌విఎస్ఎన్.సాయిరామ్ పాల్గొన్నారు. కాకినాడ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షులుగా కమలాకరరావు, ఉపాధ్యక్షులు తురగా సూర్యారావు, కార్యదర్శిగా కెవిఆర్.వరప్రసాద్, సహాయ కార్యదర్శిగా కె.రాజేష్, కోశాధికారిగా పి.సాగర్, ఉపకోశాధికారిగా కెవి.కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా శరబండి రాజు, కన్వీనర్‌గా మూర్తి, కో కన్వీనర్‌గా ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు ఎ.రమణ, సిహెచ్. రామారావు, రవిశంకర్ పట్నాయక్, ఎన్‌వి.అబ్బాయి, విజయకాంతం, జెసి.చోప్రా, ఎస్.సూర్యనారాయణ ఎన్నికయ్యారు.

చలిలో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తితో డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ జె.నరసింహనాయక్



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాపై చలి పులి పంజా విసురుతోంది. ఉదయం 8 గంటలు దాటినా ప్రజలు బయటకు రావడానికి ధైర్యం చేయలేకపోతున్నారు. పొగమంచు పూర్తిగా కమ్ముతుంది. చల్లని గాలులు వీస్తుండడంతో ఎముకలు కొరికే చలి ప్రజల్ని వణికిస్తోంది. దీంతో బయటకు రావాలంటే పిల్లలు, వృద్ధులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యఆరోగ్య శాకాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. ప్రస్తుతం అనారోగ్య సమస్యలు ఎక్కువగా బయట పడుతున్న నేపథ్యంలో ఆయన పలు అంశాలపై 'ప్రజాశక్తి ముఖాముఖి'లో వివరించారు.

ఎలాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.?

ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ చలిలో వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. చలి వలన ఊపిరితిత్తులు కొంత ఆయాసానికి గురవుతాయి. చర్మం పగుళ్ల బారడం ఆరంభమవుతుంది. మిగతావారితో పోలిస్తే చలికాలం పసికందులు, వృద్ధులకే సమస్యలెక్కువ. ఈ కాలం వీళ్లల్లో రెసిస్టెన్స్ లోపించి ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గుతుంది. దగ్గుతో కఫాన్ని బయటికి తెప్పించే శక్తి లేకపోవటం వల్ల ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఎక్కువవుతుంది.

వృద్ధులు, పసి పిల్లలపై ప్రభావం..?

వృద్ధుల్లో ప్రత్యేకించి ఆర్థరైటిస్ ఉంటే ఎముకలు మరింత బిగుసుకుపోయే ప్రమాదం ఉంది. కదలికలు తగ్గి కొన్నిసార్లు పట్టుతప్పి పడిపోయే ప్రమాదం ఉంటుంది. పసికందులను చలిగాలి సోకకుండా వెచ్చగా ఉంచాలి. స్వెటర్లు, మెత్తని రగ్గులు వాడాలి.

గుండె సంబంధిత వ్యాధులపై ఎలా అప్రమత్తంగా ఉండాలి.?

చలికాలంలోనే గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగానే ఉంటాయి. ఉష్ణోగ్రత పడిపోయినప్పుడు రక్తనాళాలు మూసుకుపోయి, రక్తాన్ని శరీర భాగాలకు పంపిణీ చేయడం గుండెకు కష్టమవుతుంది. ఈ స్థితిలో గుండె రక్తాన్ని పంపిణీ చేయడానికి ఎక్కువగా శ్రమిస్తుంది. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. ప్రత్యేకించి వృద్ధుల్లో సిస్టాలిక్, డయాస్టాలిక్ రక్తపోట్లు రెండూ పెరుగుతాయి. ఆస్తమా వ్యాధిగ్రస్తులై ఉంటే వారిలో చల్లగాలి వల్ల శ్వాసనాళాలు కుంచించుకుపోతాయి. అందువల్ల చలి గాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవడమే పరిష్కారం.



పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు..?

ఈ నెల 21వ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేశాము. ప్రతి ఒక్కరు విధిగా అప్పుడే పుట్టన బిడ్డ నుంచి 5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బూత్ బ్యానర్‌లు, స్ట్రీట్ బ్యానర్లు, గోడ పత్రికలు వేయిస్తున్నాం. మారుతున్న కాలానుగుణంగా మొబైల్ ద్వారా, వాట్స్ యాప్ మెసేజ్‌లు పెట్టడం ద్వారా జిల్లాలోని వివిధ శాఖల సమన్వయం, అందరి సహాయ సహకారాలతో విజయవంతం అయ్యేలా కృషి చేస్తున్నాం.

సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారా.?

జిల్లాలో 97 సంక్షేమ వసతి గృహాల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి మెడికల్ ఆఫీసర్ తప్పనిసరిగా వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. పిల్లలు అనారోగ్యాలకు గురికాకుండా ఎప్పటికప్పుడు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పరీక్షలు జరిపి మందులను అందజేస్తున్నాం. ఎవరికైనా ఎటువంటి ఇబ్బందులు వచ్చినా దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచిస్తున్నాం.

పిహెచ్‌సిలలో వైద్య సేవలు నిరంతరం అందుతున్నాయా.?

జిల్లాలో ఉన్న ప్రతి పిహెచ్‌సిలోనూ అలాగే ఇతర ఆరోగ్య కేంద్రాలలో 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. ముఖ్యంగా పిహెచ్‌సిలలో రాత్రిపూట కూడా వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. రోగులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా తక్షణం వైద్య సేవలు అందిస్తున్నారు. అవుట్ పేషెంట్ మందుల ఇచ్చే సమయంలో ఎవ్వరికి ఇబ్బంది లేకుండా రోగులకు సేవలు అందించాలని ఆదేశించాం. ప్రతీ పిహెచ్‌సిలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పాటించాలని ఆదేశాలిచ్చాము.

'స్క్రబ్ టైఫస్' వ్యాధిపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

స్క్రబ్ టైఫస్ 'పురుగు' (కీటకం) కుట్టడం వల్ల వ్యాపించే వ్యాధి నేపథ్యంలో ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నట్లయితే అది పూర్తిగా నయం అవుతుంది. దీనిపై ఎవరు ఆందోళన చెందవద్దు. 'పురుగు' కుట్టడం గమనించినట్లయితే సమీప ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి. స్క్రబ్ టైఫస్ ఇది వైరస్ కాదు, ఓరింటియా సుత్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, కీటకం కుట్టిన చోట నల్లటి మచ్చ ఏర్పడటం ప్రధాన లక్షణం. సకాలంలో గుర్తించి చికిత్స అందించకపోతే పరిస్థితి విషమించి ప్రాణాపాయం కలగవచ్చు.

మోడరన్ అచీవర్ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - రామచంద్రపురం



మోడరన్ అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

రామచంద్రపురం మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం మోడరన్ అచీవర్ అవార్డుల ప్రదానోత్సవాన్ని స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు మాట్లాడుతూ నవంబర్ 30న నిర్వహించిన మోడరన్ అచీవర్ స్కాలర్షిప్ ఎంపిక కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందన్నారు. 1480 మంది విద్యార్థులు వివిధ హైస్కూళ్ల నుంచి ఈ కార్యక్రమానికి హాజరు అయ్యారని పేర్కొన్నారు. వీరిలో 146 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఆదివారం వారికి పురస్కారాలు అందజేశామన్నారు. విజేతలకు ఎలైట్, ప్లాటినం, డైమండ్, గోల్డ్, సిల్వర్ క్యాటగిరీ అవార్డులను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థుల, వారి తల్లిదండ్రుల ఆసక్తి మేరకు ఇంటర్మీడియట్ కోర్సు తమ కళాశాలలో చదివినట్లయితే ఫీజులో రాయితీ ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం ఇంటర్మీడియట్ ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్ మాట్లాడుతూ తమ కాలేజీలో జెఇఇ, నీట్ , ఇఎపిసెట్ ప్రోగ్రామ్ అత్యున్నత ప్రమాణాలతో బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపులను ఇంగ్లీష్ మీడియంలో బోధిస్తున్నట్లు తెలిపారు. ప్రతి అకాడమిక్ ఇయర్ నందు ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడమే కాక, ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పరీక్షలైన జెఇఇ, నీట్, అలాగే రాష్ట్రస్థాయి ఇఎపి సెట్ నందు అత్యుత్తమ ర్యాంకులు, పర్సంటైల్ సాధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఇంటర్ విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదని పేర్కొన్నారు. మోడరన్ జిఆర్‌సి జూనియర్ కాలేజీ నందు ప్రణాళికాబద్ధమైన బోధనతో ఇంటర్మీడియట్ ప్రోగ్రాం జరుగుతున్న విషయానిన మోడరన్ అవార్డులు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాలని కోరారు. పేరెంట్స్ తీసుకునే ఒక మంచి నిర్ణయమే విద్యార్థులకు గొప్ప భవిష్యత్తును కలుగజేస్తుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ వైస్ ప్రిన్సిపల్ పిఎస్.ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సిహెచ్.శ్రీనివాస్, జెఇఇ / నీట్ స్టాఫ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా దాళ్వా పనులు

ప్రజాశక్తి - రామచంద్రపురం



వేగాయమ్మ పేట వద్ద దమ్ములు చేస్తున్న రైతు

దాళ్వా పంట దమ్ములు రైతులు ముమ్మరంగా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రామచంద్రపురం మండలంలోని కాపవరం, ఉండూరు, వేగాయమ్మ పేట తదితర గ్రామాల్లో దమ్ములు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో సుమారు 45 వేల ఎకరాల్లో వరి పంట సాగు అవుతోంది.

త్వరగా పంట చేతిక వచ్చే రకాలను చల్లుకోవాలి

త్వరగా పంట చేతికి వచ్చే రకాలను చల్లుకోవాలని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి మణిదీప్ సూచించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. సాధారణంగా రైతులు దాళ్వా పంటకు బోండాల రకాన్ని ఎంచుకుంటారని అయితే అది 130 నుంచి 135 రోజులకు కోతకు వస్తుంది అన్నారు. దానికంటే మేలైన వంగడాలను మార్టేరు వ్యవసాయ శాస్త్రవేత్తలు రూపొందించారని,వాటిలో ఎంటియు 11 21, ఎంటియు 1156, ఎంటియు 1153 రకాలు మేలైనవి అని ఆయన వివరించారు. ఇవి కేవలం 120 నుంచి 125 రోజుల్లో కోతకు వస్తాయన్నారు. దిగుబడులు ఆసజానకంగా ఉంటాయని ఆయన తెలిపారు. ఈ రకాలు చల్లుకోవడం వల్ల రైతులకు ధాన్యం ఎగుమతి బాగుంటుందని అన్నారు. కాల పరిమితి తక్కువగా ఉన్న మార్టేరు రకాలు రైతులు వెదజల్లు కోవడం ద్వారా ఏప్రిల్ మొదటి వారానికి పంటలు పూర్తవుతాయని వెంటనే అపరాలు పండించుకునేందుకు రైతులకు వీలు కలుగుతుందని అన్నారు. అపరాల పంటలు పండించడం వల్ల రైతన్నలకు తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు చేకూర్తాయని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పిఎస్‌ల పరిధిలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా ఎస్‌పి రాహుల్ మీనా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లపరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల పునరావతం నివారణ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో భాగంగా రౌడీ షీటర్లను ఆయా పోలీస్‌స్టేషన్లకు పిలిపించారు. నేర ప్రవృత్తులను విడిచిపెట్టి చట్టబద్ధమైన జీవనం గడపాలని సూచించారు. నేరాలకు దూరంగా ఉండి గౌరవప్రదమైన జీవనోపాధిని ఎంచుకోవాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి రాహుల్ మీనా మాట్లాడుతూ, జిల్లాలో అసాంఘిక శక్తులు, రౌడీయిజం, గూండాయిజానికి ఎలాంటి తావు లేదన్నారు. పాత నేరాలను పునరావృతం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌన్సెలింగ్ ద్వారా రౌడీ షీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా మారతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో బౌద్ధ దమ్మ ప్రచార రథ యాత్ర

ప్రజాశక్తి - ఐ.పోలవరం

బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా శాఖ ఆధ్వర్యంలో బౌద్ధ దమ్మ సాంస్కృతిక ప్రచార రథయాత్ర ఆదివారం రెండవ సారి మండలానికి చేరుకుంది .ఈ ఏడాది అక్టోబర్ 26 అమలాపురంలోని త్రిరత్న బుద్ధ విహార ప్రాంగణం నుంచి అయినవిల్లి, కొత్తపేట, ముమ్మిడివరం మండలాలు మీదుగా ఆదివారం రెండవ సారి టి.కొత్తపల్లి, ఐ.పోలవరం, కేశనకుర్రు, తిళ్లకుప్ప వరకు బౌద్ధ స్తూప ప్రచార రథం యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో కాశి వీరవెంకట సత్యనారాయణ, బుడితి బాబూ రాజేంద్రప్రసాద్, మట్టా వెంకట్రావు ఆయా గ్రామాల్లో మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్నవారందరికి భోజన ఏర్పాట్లు చేసిన దున్నా సుబ్బారావు, బొంతు శ్రీరాములు, చీకురుమల్లి కొండలరావుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యలమంచిలి సురేష్, కుంచే చినబాబు, బొంతు శ్రీరాములు, వరసాల లక్ష్మి నారాయణ, రేవు శ్రీను, మట్టా గగనవీరుడు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 21, 22, 23 తేదీల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జెఎన్‌టియు కెలో నిర్వహి స్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సురేష్ తెలిపారు. ఆదివారం జెవివి జిల్లా శాఖ అధ్యక్షులు కెఎంఎంఆర్.ప్రసాద్ అధ్యక్షతన సమావేశం యుటిఎఫ్ హోంలో జరిగింది. మూడు రోజుల పాటు నిర్వహించే సైన్స్ సంబ రాల ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు సైన్సు ప్రయోగాలు, క్విజ్, రాపిడ్ రౌండ్, పరీక్ష, ఫీల్డ్ ట్రిప్, సైంటిస్టులతో ముఖాముఖి వంటి కార్యక్రమాలతో నిర్వహణకు ప్లానింగ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం మయ్యేలా చూడాలని ఆయన కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ మండల కార్యకర్తలను సమీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌హెచ్‌పి.వర్మ బాధ్యులను ఎంపిక చేశారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మేకా సుబ్బారావు, వివిఎస్.రెడ్డి, దాడి పద్మనాభం, సమతా కన్వీనర్ ఉమా మంగతాయారు, ఉపాధ్య క్షులు ఎన్.సూర్య నారాయణ, ఎన్.పద్మావతి, యుఎస్ఎన్.రెడ్డి, పి.పావని, సత్యనారాయణ రాజు, చంటిబాబు, రామకృష్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని జడ్.రాగం పేట శివారు ఉన్న సాయి హాస్పటల్‌లో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎపి విపత్తుల స్పందన, అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ చెల్లె అనిల్‌కుమార్, ఎల్ఎఫ్ జి.జగదీష్‌బాబు పాల్గొని అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా స్పందించాలనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాయి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ముంద్రు ఎర్రబాబు, అగ్నిమాపక అధికారులు కెవివి.శేఖర్, ఎన్‌వివి. సత్యనారాయణ, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఆకుమడులకు నీటి యద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని తూర్పు డెల్టా ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలో ఎండపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆకుమడులకు నీటి ఎద్దడి ఉందని తెలిపిన రైతులను నేరుగా కలుసుకుని మాట్లాడారు. మూడు రోజులలో పూర్తి స్థాయిలో సాగునీటిని అందిస్తామన్నారు. పిబిసి నుంచి నీటి సామర్థ్యం పెంచేందుకు అన్ని చర్యలు చేపడుతు న్నామని అన్నారు. ఏలేరు నుంచి సోమవారం నీటిని విడుదల అవుతుందని, రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మి, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, రావు అక్షయ్, తెలగంశెట్టి వెంకటేశ్వర రావు, డిఇ సంతోష్‌కుమార్, రైతులు పాల్గున్నారు.

విద్యా రంగంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - కాకినాడ

విద్యారంగంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని యుటిఎఫ్ సీనియర్ నాయకుడు ఐ.ప్రసాదరావు అన్నారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ హోంలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సభ జరిగింది. యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో లక్ష్మయ్య చిత్రపటానికి యుటిఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర వర్మ పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నుపాటి లక్ష్మయ్య అవిశ్రాంత పోరాటం ద్వారానే ఉపాధ్యాయులకు సంఘం పెట్టుకోవచ్చనే చారిత్రాత్మక తీర్పు సాధించారని తెలిపారు. ఉపాధ్యాయులకు పెన్షన్, కముటేషన్, గ్రాట్యుటీ సాధించిన ఘనత లక్ష్మయ్యదేనని అన్నారు. నేటి ప్రభుత్వాలు పెన్షన్ తీసివేసి, కాంట్రిబ్యూషన్ పెన్షన్ అమలు చేయడం జరుగుతుందని, పోరాటాలు ద్వారానే తిరిగి పాత పెన్షన్ విధానం సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నూతన లేబర్ కోడ్స్ అమలు చేయడం ద్వారా సంఘాలకు, శ్రామికులకు నూతన అడ్డంకులు సృష్టించడం జరుగుతుందని, వీటిని సమర్థవంతంగా ఎదుర్కోవటం తక్షణ కర్తవ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు.



విరాళం అందజేస్తున్న జిఎంకె ట్రస్ట్

కల్యాణ మండపం అభివృద్ధికి జిఎంకె ట్రస్ట్ రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని శెట్టిబలిజ కళ్యాణమండపం అభివృద్ధి పనులకు గుత్తుల మీరా కుమార్(జిఎంకె) ట్రస్ట్ రూ.5 లక్షలు విరాళం అందించడం పట్ల సంఘం హర్షం వ్యక్తం చేసింది. కళ్యాణ మండపం నందు ఆదివారం గుత్తుల సాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిఎంకె ట్రస్ట్ కోశాధికారి పిల్లి నాగబాబు, సభ్యుడు వాసంశెట్టి శ్రీనివాస్ నగదును శెట్టిబలిజ సంఘ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మీరా కుమార్ సేవా గుణాన్ని అభినందించారు. నగదు అందజేసిన నాగబాబు, శ్రీనివాస్‌లకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పితాని బాలకృష్ణ, గుబ్బల రవి, దొమ్మేటి అప్పారావు, సానబోయిన మల్లికార్జునరావు, దొమ్మేటి రమణ కుమార్, రెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

17న పెన్షనర్స్ దినోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 17న స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో పెన్షనర్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్యామ్‌సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ ఎ.కాశీకృష్ణ, సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఎస్.ఈశ్వరి పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.



గ్రంథాలయ సంస్థ సంస్థ చైర్మన్ సాయిబాబు రాజును కలిసిన సంక్షేమ సంఘం

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - మామిడికుదురు

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన చైర్మన్‌గా నియమితులైన భూపతి రాజు సాయిబాబు రాజు అన్నారు. గోగనమఠంలోని ఆయన స్వగహంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ సంక్షేమ సంఘం వారు మర్యాద పూర్వకంగా కలిశారు. సాయిబాబా రాజుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఆకుల శివ రామకృష్ణ, ఉపాధ్యక్షులు ముమ్మన దుర్గారావు, కార్యదర్శి పి నాగేశ్వరావు, సంఘం సభ్యులు వై.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడు సుబ్బారావుకు ఎంఎల్ఎ అభినందన

ప్రజాశక్తి - కొత్తపేట



సుబ్బారావును ప్రశంసిస్తున్న ఎంఎల్ఎ బండారు

అధ్యాపకుడు, పాత్రికేయుడు, నటుడు, గాయకుడు డాక్టర్ వివివిఎస్.సుబ్బారావు జాతీయ కవితా పోటీల్లో టాప్-20 విజేతగా రావడం అభినందనీయమని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శ్రీ శ్రీ కళావేదిక ఇటీవల ఆన్లైన్ జాతీయ కవితా పోటీలు నిర్వహించారు. "దగ్గరవుతున్న దూరాలు" (బంధాలు, బంధుత్వాలు) అనే అంశంపై నిర్వహించిన కవిత పోటీల్లో కొత్తపేటకు చెందిన డాక్టర్ సుబ్బారావు తన ప్రతిభను కనబరిచి టాప్-20 విజేతగా నిలిచారు. కళావేదిక అధినేత కళా రత్న డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సంస్థ జాతీయ అధ్యక్షురాలు జి ఈశ్వరి భూషణం, జాతీయ కార్యవర్గ అధ్యక్షుడు నూక సంపత్ కుమార్, జాతీయ సోషల్ మీడియా కన్వీనర్ నల్ల భాగ్యలక్ష్మి విజేత సుబ్బారావు ను అభినందిస్తూ మెమొంటోను పంపించారు. టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్ తదితరులు కవి సుబ్బారావు అభినందించారు.